


# రంగు - రాగం

పచ్చిపులుసు వెంకటేశ్వర్లు

సీతామహాలక్ష్మి నగరమంతా గాలిస్తోంది. ప్రతిచోటా మగవాళ్ల "హేర్ డ్రస్సర్స్" ఉన్నాయి కాని లేడీస్ హేర్ డ్రస్సర్స్ లేవు.

అనేకచోట్ల "తెల్లవెంట్రుకలు నల్లగా చేయబడును" అని వ్రాసిఉంది.

లోనికి వెళ్ళి తనకు కావలసింది అడగాలనుకుంది. లోనంతా మగవారున్నారు. లోనికి వెళ్లలేక మరలా అన్వేషణకు బయలుదేరింది.

వెతకగా, వెతకగా వెతలు తీరాయి– ఒకచోట "లేడీస్ హేర్ డ్రస్సర్స్" అని వ్రాసి ఉంది.

లోనికి వెళ్ళింది.

అక్కడంతా నవనాగరికతతో తొణికిసలాడే నవలామణులున్నారు. వెర్రెత్తిన

వ్యామోహాలకు ప్రతిబింబాలు వారు. బాబ్డ్ హేర్‌లో కొందరు, రెండు జడలలో కొందరు, కొండంత కొప్పులతో కొందరు.

కొప్పులలో గొడుగు కొప్పులు, రింగులాలు కొప్పులు, పుట్‌బాల్ కొప్పులు, వల కొప్పులు, వంకాయ కొప్పులు.

అది చాలా పెద్దహాలు.

అడుగడుక్కి ఒక డ్రస్సింగ్ టేబిలు. ఆ టేబిలుకు నిలువెత్తు అద్దం అమర్చి వుంది.

వయారి భామలు ఒంపుసొంపులు అద్దంలో ఇటు ఒరుగుతూ, అటు ఒరుగుతూ చూసుకుంటున్నారు.

మరి అందాన్ని దిద్దే అతివలు, ముదురు ముఖాలను లేత ముఖాలు చేయాలని, పడిన ముడతలను సరిచేయాలనీ, మార్జాలాక్షులను (పిల్లికళ్లను) మీనాక్షులు చేయాలనీ, వాలిన వయసును నిలబెట్టి చూపాలని నానా యాతనలు పడుతున్నారు.

సైడ్ ఫోజులో, ముఖాముఖిఫోజులో, క్లోజప్పులో, లాంగ్ షాట్‌లో, ఎలాగున్నారో ఒక్కొక్కరు చూసుకుంటున్నారు.

కళ్లను ఆర్పుతూ కొందరు, క్రీగంటితో, మాగన్నుతో కొందరు ఎలాగుంటారో చూసుకుంటున్నారు.

చిరునవ్వు, దోరనవ్వు, పండునవ్వు, పాపనవ్వు, ముదురునవ్వు, లేతనవ్వు, మాయనవ్వు, మకిలినవ్వు, మల్లెనవ్వు, ముద్దునవ్వు, మొద్దునవ్వు, వంకరనవ్వు, వయ్యారపునవ్వు, వెకిలినవ్వు, విరుపు నవ్వు— నవ్వి, నవ్వి అద్దంలో చూసుకుంటున్నారు.

ఎండిన పెదిమలను పండించుకునేందుకు రంగు పులుముకుంటున్నారు.

ఒలికిన పాలను గిన్నెకెత్తుతున్నారు.

అదో రంగుల ప్రపంచం.

కృత్రిమత, ఆడంబరం, తాండవించే జంతర్ మంతర్

గేటువద్ద అలాగే నిలబడిపోయి అలాగే నిలబడి, నివ్వెరపోయి చూస్తూంది

ఒక లేడీ అటెండరు వచ్చి "వాట్ కెన్ ఐ డు ఫార్ యూ" అని నైస్‌గా, పెదిమలు తగిలీ తగలనట్లు గొంతులో ఒయ్యారమొలికిస్తూ అడిగింది.

"ఏమమ్మోయ్' ఇక్కడ నల్లవెంట్రుకలను తెల్లగా చేస్తారా ?"

పాషన్లు దిద్దుకునే ముద్దు (మొద్దు లేక ముదురు) గుమ్మలు చేష్టలుడిగి, నోళ్లు తెరచి ఆ ఆగంతుకురాలు వైపు చూస్తున్నారు.

అటెండరుకు నోటనుండి మాట రాలేదు.

కాసేపటికి తెప్పరిల్లి "ఏమిటండీ మీరడిగేది ?" అని అడిగింది. ప్రొప్రయిటరమ్మను పిలుచుకువచ్చి, చెప్పింది.

గుటక పడక, గుటగుటలాడుతూ తమ ప్రొప్రయిటరమ్మ— సౌందర్య సృష్టికర్త్రి (కర్తకు స్త్రీలింగం), పున ర్యవ్వన ప్రదాత్రి (ప్రదాతకు స్త్రీలింగం) జరాఘాతకి ఇత్యాది బిరుదులు గల— ప్రేమలీలా పంకజం వడివడిగా అచటికి వచ్చింది.

ఆమె యువతిలా కనుపించు ప్రౌఢ.

సీతామహలక్ష్మి ఆమెనూ అదే మాటడిగింది. ఆమె దిగ్భ్రాంతురాలై "వాట్ డు యు మీన్" అని అడిగింది.

"నల్లవెంట్రుకలను తెల్లవెంట్రుకలు చేస్తారా ?"

"నాటకంలో వేషం వేయడానికా ? ఎవరినైనా మోసపుచ్చడానికా మేడమ్?"

"కాదు. అలాంటి వెంట్రుకలతో నిత్యం ఉండాలనే అడుగుతున్నాను."

"తల్లీ ! నువ్వు ఏ కాలం దానివి ?''

"ఈ కాలం దానినే. నేనడిగిన ప్రశ్నకు మరల ఇంకొక ప్రశ్నవేయడం జవాబివ్వడం కాదు "

"ఎక్స్క్యూజ్ మీ. మీ రెందుకు అడుగు తున్నారో నా కర్థంకావడంలేదు."

చుట్టూవున్న వన్నెల (తెచ్చిపెట్టు కున్న) విసనకర్రలంతా యిటే చూస్తు న్నారు. ఎవరీ అమాయక శిఖామణియని హేళన చూపులు చూస్తున్నారు. బి.సి. కాలపు ఈ పిచ్చికల్లా ఎవరా అని తుస్కార భావంతో చూస్తున్నారు.

"అర్థంకాకపోయే విషయమేమీ కాదే! నేను ముసలిదాన్నిగా కనపడాలని వెంట్రుకలు తెలుపు చేసుకోవాలను కుంటున్నాను."

"మేడమ్ ! ఇప్పుడు మనం నవనవ లాడే నవనాగరికతలో ఉన్నాము. ముసలివాళ్ళు పడుచువాళ్ళగా కనుపించా లని నానా తంటాలు పడుతుండే కాల మిది. వెంట్రుక తెల్లబడితే వయసెక్కడ వల్లకాటికి లాక్కుపోతుందోనని వాపోయే కాల మిది. మా సంస్థలన్నీ ఎలా కళ కళలాడుతున్నాయో, ఎలా డబ్బు చేసు కుంటున్నాయో మీకు తెలిసినట్లు లేదు. తల్లీ ! మా బ్రతుకు వాళ్ల తెల్లవెంట్రుకల మీదనే ఆధారం. ఆ వెంట్రుకలను నలుపు చేస్తూ, నిగనిగలాడిస్తూ రింగులు త్రిప్పుతూ, ఈ భామలను సీతాకోక చిలు కలను చేస్తున్నాము. ఇంతకూ తమ అందాన్ని హత్య చేసుకునే అవసర మేమొచ్చింది ?" అని ప్రేమలీలా పంకజం అడిగింది.

"అది రహస్యం."

"సరే కాన్ఫిడెన్షియల్ రూములోకి పద."

పూర్వం కోప గృహాలు, తాప గృహాలు, తాపుగృహాలుండేవి. ఇలాంటి డ్రస్సింగ్ టాయిలెట్ మందిరాల్లో ఈ రహస్యపు గదులు అనివార్యంగా ఉంటు న్నాయి. మరి ప్రౌఢలు (ముదురు

మగువలు) తాము కోరిన హంగులలో తమ పోయిన అందం తెచ్చుకోవాలని చెప్పుకోవాలిగా! విపరీతాన్ని కోరేప్పుడు రహస్యం అవసరమే !

"కూర్చోండి మేడమ్! ఇక చెప్పండి మీ కెందుకా కోరిక కలిగిందో ?"

"మాది ప్రేమ వివాహం. మా జీవితాలు నిత్యనూతనంగా సాగుతున్నాయి. అరమరికలు లేని సంసారం మాది."

"మీ ప్రేమ, మీ జీవితం కాదు నేను కోరేది. ఈ విపరీతమైన కోరిక ఎందుకు కలిగిందా అని అడుగుతున్నాను."

"అదే చెబుతున్నాను. ఇక్కడికి వచ్చి కోరేవారి కోరిక విపరీతం కాదా ? బాల్య యవ్వన కౌమార వార్థక్యాలు ప్రకృతి సహజం కదా ! సహజంగా ప్రాప్తించిన కౌమార వార్థక్యాలను కప్పిపుచ్చుకోవాలనుకోవడం విపరీతంకాదా!"

"విపరీతమే ఏ విపరీతం లేకుంటే మేమెందుకు మేడమ్. స్త్రీ సహజంగా వయసును కప్పిపుచ్చుకోవాలనీ, ఎప్పుడూ అందంగా ఉండాలనీ చూస్తుంది. అది భర్త ప్రేమను తరగనీయకుండా ఉండేట్లు చేయడానికో, చూచే వారిని ఆశ్చర్యపరచడానికో అయుంటుంది."

* * *

"ఎవరి అందం వారికి కనుపించదు కదా ! అది యితరులకోసమే. ముఖానికి ఎదుట అద్దముంటే లేదా అద్దం వంటి మగడు ఎదుటవుంటే వారి అందం వారికి కనుపిస్తుంది. మా వారికి వయసు రాకముందే వెంట్రుకలు తెల్లబడ్డాయి. లేతవయసైనా, ముదురుగా కనిపిస్తారు. నేనూ, ఆయనా పోయిన ప్రతిచోటా 'మీ వారికి రెండవపెళ్లా?' అని అడుగుతున్నారు. కాదనీ, ప్రేమ వివాహమనీ ప్రతిచోటా చెప్పవలసి వస్తుంది. వారిని హేళనగా చూస్తున్నారు. నన్ను జాలిగా చూస్తున్నారు "

"మరి మీవారిని వెంట్రుకలకు రంగు వేయించుకోమనక పోయారా ?"

"ఆ మాట నేనంటే, ఇప్పుడు నేను అందంగా లేనా అని, నా అందాన్నే ప్రేమిస్తున్నావా అని పెడర్థాలు తీసి మాట్లాడుతున్నారు."

"పెద్ద చిక్కొచ్చిందే."

"మొన్న బంధువులింటికి పెళ్ళికి మేమిద్దరం వెళ్లాం. తెలిసిన వారేమీ అనుకోలేదు. తెలియనివారంతా "ముసలి మొగుడు, పడుచు పెళ్లాము"ని ముఖాన్నే అన్నారు. ఆయన చాలా బాధపడి పోయారు.

చెప్పకూడదు కాని, అర్ధరాత్రి గదిలో ఒంటరిగా పడుకునివుంటే, పెళ్లికొచ్చిన హిప్పీగాడు నన్ను లేపి బలవంతం చేయబోయాడు. "ఆ ముసలి వాడితో ఏమి సుఖపడతావు. రా," అన్నాడు. ఇంతలో బంధువులు రావడంతో, వారిలో కలిసిపోయాడు.

ఇలాంటి అనర్థాలను, ఆపదలను అనేకం ఎదుర్కోవలసి వస్తుంది. మా వారిలో బాధకూడా కనిపిస్తుంది. తననందరూ ముసలివాడంటున్నారే, తన భార్య పరువంలోనే ఉన్నదనే వ్యధ కనపిస్తుంది. నా అందం, పరువం ఏమి చేసుకోను, వారికీ, నాకూ సుఖం లేకపోయిన తరువాత. కాబట్టి నా వెంట్రుకలకు తెల్ల రంగు వేస్తే, యిద్దరిదీ ఒకే రంగవుతుంది. సమస్య తీరిపోతుంది."

"మీకు మీ భర్తపట్ల ఎంత ప్రేమ మేడమ్ భర్త బాధ తగ్గించేందుకు నీ అందాన్నే కప్పిపుచ్చుకోవాలనుకుంటున్నావు ఈ కాలపు స్త్రీకి ప్రాణం, మానం కంటె అందం ముఖ్యం. నిజమైన త్యాగమంటే మీది.

సరే. శాశ్వతంగా తెలుపుచేసే క్రీములు లేవు. మా వద్ద తాత్కాలికంగా నలుపు చేసే క్రీములున్నాయి గాని, తెలుపు చేసేవి అసలు లేవు. ఒక రంగు పౌడరుతో ఒక్కరోజు నిలువగలిగేటట్లు మీ వెంట్రుకలు తెలుపు చేస్తాను మొత్తం తలంతా చేయను. అక్కడక్కడ తెలుపుచేసి ఎఫెక్ట్ తెస్తాను. రేపు క్రీము తెప్పించి యిస్తాను."మేకప్ చేయడం ప్రారంభించి, అతి నేర్పుగా ఎఫెక్టిచ్చింది.

ముఖాన్ని తృప్తిగా అద్దంలో చూసుకుని, సీతామహాలక్ష్మి రుసుము చెల్లించి బయటకు వచ్చింది.

అందాల భామలంతా (వాళ్లనుకుంటారు) నోళ్లు తెరుచుకు చూస్తున్నారు.

సీత... యింటికి వచ్చింది. మహానగరంలో కాబట్టి ఒకర్ని ఒకరు పట్టించుకోరు. లేకుంటే ఈ మేకప్పు చూస్తే అమ్మలక్కలూర్కుకుంటారా ?

ఎవరో తలుపు తట్టారు.

తీసింది సీతామహాలక్ష్మి.

"ఎవరు కావాలండీ ?" అని వచ్చినాయన్ని అడిగింది.

"మీరెవరండీ" అని వచ్చినతను అడిగాడు

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

సీత భర్త జగన్నాథం నల్లరంగు వెంట్రుకలతో, సీత తెల్ల వెంట్రుకలతో.

తెప్పరిల్లుకున్నారు. అర్థం చేసుకున్నారు. ఆప్యాయంగా, అనురాగంగా ఒకరిలో ఒకరు ఒదిగిపోయారు ఆ రంగులలో రాగం ప్రతిఫలించింది.

భర్త వ్యధ చూచి అందాన్ని కప్పిపుచ్చుకో జూచిన అతివ.

భార్యకోసం తన యిష్టాన్ని వదిలేసి లేని అందం తెచ్చుకున్న పతి.

వారి అన్యోన్యతను చూచి గడియారం 12 కొట్టింది

పరిపూర్ణ జీవనానురాగవీణ మ్రోగినట్టయింది.